

నిధుల స్వాహాపై విచారణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పురపాలక సంఘ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులతో తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించి రూ.కోట్లు స్వాహా చేసిన వారిని గుర్తించి వారి ద్వారా చేసిన సొమ్మును రికవరీ చేయాలని సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ బ్యాంక్ అధికారులు పంపిన నోటీసులతో రూ.కోట్ల విధులు స్వాహా చేసినట్లు బయటపడిందని పేర్కొన్నారు. ఇప్పటికే మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి కూడా గుర్తించి స్వాహా చేసిన గ్రూపులో నుండి రికవరీ ఆదేశాలు చేసినట్లు తెలిసిందని చెప్పారు. లోతుగా విచారణ చేపట్టినట్లయితే ఎన్నో ఆసక్తికరమైన విషయాలు బయటపడతాయని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డులలో సుమారు 1700 స్వయం సహాయక గ్రూపులు కలవని వీటి పర్యవేక్షణ కోసం 60 మంది ఆర్పీలు వీరిని పరిరక్షించేందుకు కోసం సిఎంఎం, సిఒలు కూడా ఉన్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మెప్మాలో జరిగిన అవినీతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని స్వాహా చేసిన సొమ్మును బ్యాంకులు చెల్లించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

భూ కబ్జాలను అరికట్టండి



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

- 30న కలెక్టరేట్ ముట్టడి
- భూ సదస్సులో వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భూ కబ్జాలు అరికడతారా లేక ఎర్రజెండా పాతి పేదలకు పంచమంటారా అంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎఐఎడబ్ల్యుయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూ కబ్జాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. అధికార పార్టీ నేతల అండదండలతోనే అధికారులు లొంగిపోయి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదలు ఇంటి కోసం జానెడు స్థలం ఆక్రమిస్తే మంద బలంతో వాలిపోయి నానా యాగిచేసే అధికారులు వందల ఎకరాలు ఆక్రమణలకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. పేదల చేతుల్లో భూమి ఉంటేనే గౌరవం ఉంటుందని, ఉపాధి దొరుకుతున్న పరిస్థితుల్లో వారికి ఉన్న అరకొర భూములు కూడా కబ్జాకు గురవడం దుర్మార్గమని పేర్కొన్నారు. దొంగ పత్రాలను సృష్టించి భూములను అప్పనంగా కాజేసే వారికి అధికార పార్టీ నేతలు అండదండలు ఉన్నాయని విమర్శించారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి రికార్డులు తారుమారు చేస్తున్నారని, భూముల నుండి పేదలను, దళితులను దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్‌మెంట్ చట్టాన్ని మార్చివేసి పేదల భూములను పెద్దలకు కట్టబెట్టాలని జగన్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందుకే ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలో అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. భూములను పేదలకు పంచాలని లేని పక్షంలో ఎర్రజెండాలు పాతి ప్రభుత్వ భూములను పేదలకు పెంచుతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుండి భూ కబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. భూ కబ్జాదారులుకు అధికారులు కూడా వత్తాను పలుకుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూములు, 1బిలో పేర్లు మారిపోవడం, ప్రభుత్వ భూములు సైతం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు సమగ్ర విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రతి మండలంలో దొంగ డాక్యుమెంట్లతో ప్రభుత్వ భూములను కాజేయడం, దళితుల భూములను ఆక్రమించడం, దాడులు చేయడం ఎక్కువగా జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాయచోటి మండలంలో అక్రమ రిజిస్ట్రేషన్లపై కేసులు నమోదు చేసినా, కబ్జాదారులు, నిందితులకు ఉన్న పలుకుబడితో కేసు నీరు గార్చే అవకాశం ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఇప్పటికే జిల్లాలో అనేక ప్రాంతాల్లో నమోదైన కేసుల పురోగతి లేదు కాబట్టి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని జిల్లాలో జరుగుతున్న భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలని, ప్రభుత్వ భూములకు, దళితుల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. అన్నమయ్య జిల్లా నాయకులు పందికాళ్ల మణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.రామచంద్ర తదితరులు ప్రసంగించారు. పేదల, ప్రభుత్వ భూములు కాపాడాలని, దళితుల భూములకు రక్షణ కల్పించాలని, భూ కబ్జాలపై జిల్లా జడ్జి పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్, ఎస్‌పి పర్యవేక్షణ లో విచారణ చేపట్టాలని, అధికారులు స్పందించక పోతే జనవరి 30న కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా కార్యదర్శి అన్వేష్, అన్నమయ్య జిల్లా నాయకులు వేమనారాయణ, శివయ్య, జయరామయ్య, నాగబసిరెడ్డి, సుజాత, రమణమ్మ, ఓబులేసు, చిన్నప్ప పాల్గొన్నారు.

మాడిఫికేషన్ పోస్టింగులకు తెరపడేనా!

- సీనియర్ ఎంఎల్‌హెచ్‌పిలపై వేధింపులు
- ఇతర జిల్లాలకు వెళ్లాల్సిందేనంటూ హూంకరింపు
- 15 మందికిపైగా ఎంఎల్‌హెచ్‌పిల్లో ఆందోళన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాడిఫికేషన్ ఉత్తర్వుల పేరుతో చేపట్టిన ఎంఎల్‌హెచ్‌పి పోస్టింగుల వ్యవహారంలో గందరగోళం నెలకొంది. ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారుల తప్పిదాల వల్ల మాడిఫికేషన్ పోస్టింగులు, రెండేళ్లుగా ఎంఎల్‌హెచ్‌పిలుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మాడిపికేషన్ ఉత్తర్వుల కింద ఖాళీ చేసిన స్థానాలను గుర్తించి పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇటువంటి ప్రయత్నం చేయకుండా ఉద్దేశపూర్వకంగా పోస్టింగులు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా గత డిసెంబర్ 15న రీజియన్ పరిధిలోని 3,106 ఎంఎల్‌హెచ్‌పిలను ఏడు బ్యాచ్‌లుగా విభజించింది. అనంతరం క్రమపద్ధతిలో బదిలీలకు శ్రీకారం చుట్టింది. వేకెన్సీ నోటీసు విడుదల చేయడం, దానికి అనుగుణంగా పోస్టింగులను భర్తీ చేయాల్సి ఉంది. 324 మందిని గుర్తించినట్లు సమాచారం. వీరిలో 240 మందిని మ్యాపింగ్ చేసింది. కడప జిల్లాలో ముగ్గురు, అన్నమయ్య జిల్లాలో ముగ్గురు, మిగిలిన ఆరు జిల్లాలతో కలిపి 15 మంది నుంచి 20 మంది ఎంఎల్‌హెచ్‌పి పోస్టింగులను మాడిపికేషన్ ఉత్తర్వుల కింద భర్తీ చేసినట్లు సమాచారం. కడప జిల్లాలోని బద్వేల్ మండల పరిధిలోని తొట్టిగారిపల్లి పిహెచ్‌సి, పోరుమామిళ్ల పిహెచ్‌సిలకు కేటాయించిన ఎంఎల్‌హెచ్‌పిలను చిత్తూరు జిల్లాకు చెందిన ఎంఎల్‌హెచ్‌పిలను బదిలీ చేసినట్లు తెలిసింది. చిత్తూరు జిల్లా రామకుప్పం పిహెచ్‌సికి చెందిన ఓ ఎంఎల్‌పిహెచ్ రెండేళ్లుగా విధులు నిర్వహిస్తోంది. ఆమె స్థానంలో ఎనిమిదవ బ్యాచ్‌కు చెందిన ఎంఎల్‌హెచ్‌పికి పోస్టింగ్ ఇవ్వడం, ఆమె వెంటనే విధుల్లో చేరిపోవడం జరిగిపోయింది. ఆమె ఆర్‌డిని కలిసిన సమయంలో సీనియర్‌గా విధులు నిర్వహిస్తున్నందున రామకుప్పం పిహెచ్‌సిలోకి ఎవరూ రారని, ప్రశాంతంగా వెళ్లాలని పేర్కొన్న ఆర్‌డి రాత్రికి రాత్రే అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆర్‌డి కార్యాలయం సూచించిన పిహెచ్‌సిలకు వెళ్లి జాయిన్ కావాలని హూంకరించినట్లు సమాచారం. వేకెన్సీ నోటీసులో పేర్కొన్న స్థానాలకు పోస్టింగులు ఇవ్వాల్సిన ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు, అరైవల్ స్థానాలకు పోస్టింగులు ఇవ్వడంలో ఆంతర్య మేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. కడప రీజియన్ పరిధిలో బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి పిహెచ్‌సి, పోరుమామిళ్ల పిహెచ్‌సిలకు పోస్టింగులు ఇచ్చినంతలోనే సొంత జిల్లా చిత్తూరుకు పోస్టింగులు దక్కించుకోవడం వెనుక మతలబేమిటో అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లా రామకుప్పం పిహెచ్‌సిలో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పి అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పిహెచ్‌సిలకు వెళ్లి తీరాల్సిందేనంటూ వేదించడం విస్మయాన్ని కలిగిస్తోంది. మాడిపికేషన్ ఉత్తర్వుల కింద రీజియన్ పరిధిలో 15 నుంచి 20 మంది ఎంఎల్‌హెచ్‌పిలను బదిలీలు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి బదిలీలు, నియామకాల్లో చోటుచేసుకున్న నిబం ధనల ఉల్లంఘనల్ని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.



డబుల్ పోస్టింగులు ఇవ్వడం తగదు

ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల డబుల్ పోస్టింగులు ఇవ్వడం నిబంధనలు ఉల్లంఘించడమే. రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిల స్థానానికి మరొకరిని పంపించడం అన్యాయం. ఇటు వంటి అన్యాయాలను సరిదిద్దాలి. తక్షణమే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం.

- వెంగల్‌రెడ్డి, మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు. కడప.



ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ ఉద్యోగులు

ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని గూడరేవుపల్లి పంచాయతీ పరిధిలో కబ్జాకు గురైన 53 సెంట్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ జి.రవి తెలిపారు. కలెక్టరుకు అందిన ఫిర్యాదుల మేరకు తమకిచ్చిన ఆదేశాను సారం స్థానిక తిరుపతి రోడ్డులో సర్వే నెంబర్ 200/3లో 53 సెంట్ల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా కబ్జా చేశారన్నారు. అందులో మట్టితోలి చదును చేస్తుండగా శుక్రవారం తమ సిబ్బంది అక్కడికి చేరుకుని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అది ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజశేఖర్, గూడరేవుపల్లి విఆర్‌ఒ రెడ్డి రాణి, విఆర్‌ఎలు ఆది, రెడ్డప్ప పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులదేనని సిఎంఒ సలహాదారు ధనంజయరెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలతో ప్రజలు గ్రామాలలో ముఖ్యమంత్రి పట్ల సానుకూల అభిప్రాయం ఉందా లేదా అని అధికారులును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో ఉపాధ్యాయులు ప్రభుత్వం పట్ల అసంతృప్తితో ఉండడానికి కారణం ఏమని ఎంఇఒ రంగనాథరెడ్డిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అధికారులు తమ తమ శాఖలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పద్మజ, మండల కన్వీనర్ రమేష్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు రత్న శేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య, ఆర్‌అండ్‌బి డిఒ చంద్రశేఖర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెహచాన్ కార్డులతో చేనేతలకు లబ్ధి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పెహచాన్ కార్డులతో చేనేత కార్మికులు సంక్షేమ పథకాల లబ్ధిపొందవచ్చునని జూనియర్ వీవర్స్ ఫీల్డ్ ఆఫీసర్ రామనాథం శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని శ్రీచౌడేశ్వరమ్మ ఆలయం వద్ద బిసి సంక్షేమ సంఘం చేనేత యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్‌తో కలిసి చేనేత కార్మికులకు పెహచాన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా ప్రారంభమైనప్పుడు ప్రజా సాధికార సర్వే ద్వారా అర్హులైన చేనేత కార్మికులను గుర్తించి వారికి పెహచాన్ కార్డులను అందజేశామన్నారు. ప్రస్తుతం వాటిని రెన్యువల్ చేసి కార్మికులకు పంపిణీ చేశామని తెలిపారు. ముఖ్యంగా ఈ కార్డు ద్వారా 50 ఏళుదాటిన చేనేత కార్మికులు పెన్షన్లు, ముద్ర రుణాలు, సబ్సిడీతో షెడ్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందవచ్చునన్నారు. ఈ కార్డులను కేంద్ర ప్రభుత్వం జారీ చేసిందని గుర్తుచేశారు. కావున అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడు పెహచాన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం చేనేత యువజన విభాగం సత్యసాయి జిల్లా అధ్యక్షులు పాలినేని నరసింహులు, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, కార్యవర్గ సభ్యులు బాబ్ జాన్, హరీష్, శంకర్, పెద్ద ఎత్తున చేనేత కార్మికులు చేనేత రంగానికి సంబంధించిన కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న అధికారి

రీసర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి రాయచోటి

జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షా, సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువు లోపల పూర్తిచేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ రీ-సర్వే, భూ సేకరణ ఎస్సీ ఎస్టీ కాలనీలలో శ్మశాన వాటికలకు స్థలాల గుర్తింపు, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే పక్కాగా పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో రీ సర్వేకు సంబంధించి అవసరమైన సర్వేయర్లు, సిబ్బంది ఉన్నారని రీ సర్వేను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్డీవోలు తగు చర్యలు చేపట్టాలన్నారు. సర్వే వల్ల ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని రీసర్వే పనులు పక్కాగా, పగడ్బందీగా చేయకపోతే రెండవ సారి చేయాల్సి వస్తుందన్నారు. రీసర్వేకు సంబంధించిన ప్రతి పని జాగ్రత్తగా పరిశీలించి చేయాలన్నారు. సమగ్ర సర్వేవల్ల అన్ని భూ వివాదాలు పరిష్కారం అవుతాయని రైతులకు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేకు సంబంధించి రైతులందరికీ అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 30 మండలాలలో రీ సర్వేకు సంబంధించి ఎక్కడ కూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. రీ సర్వే పనులను సంబంధిత ఆర్డీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు భూ పంపిణీ చేసేందుకు ప్రతి మండలంలో తహశీల్దార్‌లు 100 ఎకరాలు ప్రభుత్వ భూమి గుర్తించి తమకు రిపోర్ట్ పంపాలన్నారు. ఈ భూమి ఎస్సీ, ఎస్టీ పేదలకు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటివరకు గుర్తించిన ప్రభుత్వ భూమి, ఎస్సీ, ఎస్టీ అర్హుల జాబితా వెంటనే తమకు పంపాలన్నారు. తహశీల్దార్‌లు అందరూ ప్రతి మండలంలో గ్రామాల వారీగా సర్వేనెంబర్ల వారీగా ఎంత భూమి గుర్తించారో నివేదిక తమకు పంపాలన్నారు. ఇది పేదలకోసం చేసే కార్యక్రమం అని ఇప్పటినుంచి తహశీల్దార్లు, సర్వేయర్లు భూ సేకరణ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో ప్రభుత్వ భూమి ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఆర్డీవోలు, తహశీల్దార్లకు సూచించారు. శ్మశానాలు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు వెంటనే స్థలాన్ని గుర్తించాలన్నారు. శ్మశానవాటిక గ్రామానికి కిలోమీటర్ లోపల మాత్రమే ఉండేటట్లు చూడాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు శ్మశానవాటిక లేదని ఎటువంటి ఫిర్యాదులు తమకు రాకుండా చూడాలని తహశీల్దార్లకు సూచించారు. జిల్లాలో బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ల నిర్మాణాలకు సంబంధించి ఫారెస్ట్ ల్యాండ్‌ను గుర్తించాలన్నారు. కోర్టు కేసులను జాగ్రత్తగా పరిశీలించి బాధితులకు నోటీసులు జారీ చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీవోలు రంగస్వామి, కోదండరామిరెడ్డి, మురళి, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో అభివృద్ధి : డిఆర్ఒ

ప్రజాశక్తి-వీరబల్లి

హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో మండలం అన్ని రకాల అభివృద్ధి జరుగుతుందని డిఆర్ఒ సత్యనారాయణ అన్నారు. ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మండలంలోని డి.రాచపల్లి వాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజాభిప్రాయం మేరకు ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులు కూడా కల్పిస్తారన్నారు. నిర్మాణం జరుగుతున్న సమయంలో స్థానికులకు ఉపాధితోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ప్రాజెక్ట్ నమూనా ప్రకారం ఎగువన, దిగువున జలాశయం పవర్ హౌస్, అనుబంధ మౌలిక సదుపాయాలు ఉంటాయన్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 2720 నుండి 1800 మెగావాట్ల మార్పునకు భారత ప్రభుత్వం ద్వారా ఆమోదించిందని చెప్పారు. ప్రాజెక్ట్‌కు అవసరమైన భూమి 486.28 హెక్టార్లు, 325.89 హెక్టార్ల అటవీ భూమి, 160.39 హెక్టార్ల అటవీ ఈతర భూమి అవసరం అన్నారు. ఇది మూడు సంవత్సరాల ఆరు నెలలు ప్రణాళిక అబద్ధంగా పనులు చేపట్టామన్నారు. ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి జివిఎస్‌డి ప్రసాద్‌రాజు మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రధాన లక్షణాలను ఇఐఎ అధ్యయనం యొక్క ఆవిష్కరణలను ప్రజలకు వివరించారు. పర్యావరణ ఇంజనీరు జావిద్‌బాషా ప్రాజెక్టు ఏర్పాటుతో పర్యావరణానికి తీసుకునే చర్యలు గురించి వివరించారు. ప్రాజెక్టు చుట్టుపక్కల మొక్కల పెంపకం, పార్కుల అభివృద్ధి చేపడతామన్నారు. మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కృషి వెనక ఎంపీ, మంత్రి పాత్ర ఎంతో ఉందని చెప్పారు. ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వంగిమళ్ళ గ్రామాల ప్రజల్లో చాలా అపోహలు ఉన్నాయని వాటన్నింటికీ ప్రాజెక్టు నిర్వాహకులు తగు వివరణ ఇవ్వాలని కోరారు. సింగల్ విండో ప్రెసిడెంట్ కల్లూరి రామ్మోహన్‌రెడ్డి ప్రజల రైతులు అభిప్రాయం మేరకు ప్రాజెక్టు వారు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం భూములకు నష్టపరిహారం కల్పించాలన్నారు. న్యాయవాది పవన్ కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు మదన్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాం గౌడ్, పిఆర్‌సిఎఫ్ అధ్యక్షుడు సుంకు రవీంద్ర, సిద్దపటం రవి, పర్యావరణ నాయకులు రవీంద్రారెడ్డి, ఎంఎం రెడ్డి రమేష్ నాయుడు, తదితరులు అభిప్రాయాలను తెలిపి నిబంధనల మేరకు రైతులకు జనాలకు ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రాజెక్ట్ ఏర్పాటుతో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందని ఇక్కడి మాండవ్య నీరు కాకుండా అన్నమయ్య, వెలిగల్లు, ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసుకోవడంతో పాటు మండల వాసులకు సాగునీరు వసతి కల్పించాలన్నారు. మండలానికి 24 అవర్స్ విద్యుత్తు అందించాలన్నారు. స్థానికులకు ఉపధి కల్పిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామీణులు ప్రతిపాదిత ప్రాజెక్టును స్వాగతిస్తూ ప్రాజెక్టు వారి ప్రాంతంలో రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు సమావేశంలో డిఎస్‌పి శ్రీధర్, తహశీల్దార్ తులసమ్మ, ప్రాజెక్టు ప్రతినిధులు, ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్ఒ సత్యనారాయణ

ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి

వాల్మీకిపురం: ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాలను తీసుకోవడం వలన మంచి ఆరోగ్యంగా జీవించవచ్చునని జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తిలో గ్రామ సమైక్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత తగ్గిస్తే మాతా,శిశు మరణాలు తగ్గుతాయన్నారు. కిశోర బాలికలు, వారి తల్లులు, గర్భవతులు, బాలింతలలో రక్తహీనత నివారణ కోసం మంచి సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ఐరెన్ ఎక్కువగా ఉన్న ఆహారాలను, ముఖ్యంగా రాగులతో తయారు చేసిన వంటలు రాగి సంగటి, రాగి రొట్టి, రాగి జావ, కర్జూరాలు, ఎండు ద్రాక్ష, గోగాకు, బెల్లంతో చేసిన పిండి వంటలు, బాలామృతం, కోడిగుడ్లు, వంటి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఎనీమియాను నివారించవచ్చునన్నారు. గర్భవతిగా ఉన్న సమయంలో ఐరెన్ ఎక్కువ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కాన్పు సాధారణంగా అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, సిహెచ్‌వో ఇందిరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ పూర్ణమ్మ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి

వాల్మీకిపురం: నాడు నేడు పనులను వేగవంతంగా చేయాలని మదనపల్లి డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేటవీధిలోని ఎంపిపిఎస్ స్పెషల్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు ఫేస్ 2 పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరత్నం, హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఉగాదిలోపు ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఉగాదిలోపు జిల్లాలోని జగనన్న లేఔట్లలో చేపట్టిన 22,229 ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ అధికారులన కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న లేఔట్ లలో గృహ నిర్మాణాలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంత ఇంటిని కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహ నిర్మాణాలు చేపట్టింది అన్నారు. ఈ మేరకు జిల్లాలో ఆర్‌సి దశలో 7076, ఆర్ఎల్ దశలో 8086, బిఎల్ దశలో నిర్మాణంలో ఉన్న 6950 ఇళ్లను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలలో ప్రతి వారమూ కచ్చితంగా దశల వారీ స్టేజ్ కన్వర్షన్ జరగాలని సూచించారు. వారంలో మూడు రోజులు ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి కేటాయించిన లక్ష్యంలో ప్రగతి సాధించాలన్నారు. డిఎల్ డిఓలు వారంలో నాలుగు రోజులపాటు జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత లేఔట్లలోని ఇళ్లకు వందశాతం మ్యాపింగ్, జియో ట్యాగింగ్ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న లేఅవుట్లలోనే కాకుండా అర్హులు ఎవరైనా సొంత స్థలాలలో ఇళ్లను ప్రారంభించినుకుని ఉంటే వాటికూ మ్యాపింగ్, జియో ట్యాగింగ్ వెంటనే చేయాలన్నారు. కార్యక్రమాన్ని డిఇలు, ఏఈలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

గృహ నిర్మాణంలో ఇచ్చిన లక్ష్యాలను సాధించడం, ప్రగతిలో వెనుకబడడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం, వారం వారం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయలేకపోవడంతో వాల్మీకిపురం, రామాపురం గృహ నిర్మాణ శాఖ ఎఇలు సుబ్బారెడ్డి, కెఎన్ఎం ప్రసాదు, రామసముద్రం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ హౌసింగ్ పీడీని ఆదేశించారు. పీలేరు, కోడూరు మండలాలలో గృహ నిర్మాణాల ప్రగతిలో తగిన పర్యవేక్షణ చేయకపోవడంతో వాల్మీకిపురం, పీలేరు, కోడూరు ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జిల్లాల మంజూరు చేసిన 950 పనులలో 852 పనులు ప్రగతిలో ఉన్నాయని, 38 పనులను పూర్తి చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. మంజూరు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవోలకు కలెక్టర్ సూచించారు. ఆయా నియోజకవర్గాలలో ఇప్పటికే గ్రౌండింగ్ చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పెండింగ్ బిల్స్ ను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు.సమావేశంలో హౌసింగ్ పీడీ శివయ్య, సిపిఓ కృష్ణ నాయక్, ఏడి వెంకటేష్, డిఆర్డిఎ పిడి నారాయణ, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఈఈలు, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా టిడిపి ప్రభంజనాన్ని ఆపలేరు : 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా టిడిపి ప్రభంజనాన్ని ఆపలేరని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలోని మండిపల్లి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రజలలో వస్తున్న ఆదరణను జగన్ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు సభలకు ఇసుకవేస్తే రాలని తీరుగా వస్తున్న జన సంద్రమే దీనికి ఉదాహరణ అని చెపాపరు. ప్రజాదరణను తట్టుకోలేని జగన్ రాత్రికి రాత్రే తెలుగుదేశం పార్టీ ప్రభంజనాన్ని ఎలాగైనా ఆపాలని కుట్రలు పన్ని ఎప్పుడో పురాతన బ్రిటీష్ కాలంనాటి జీవోలను అమలు చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. జీవోపై రాష్ట్రంలో ప్రతిపక్షాలు, వామపక్షాలు , ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నారని చెప్పారు. ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులకు రక్షణ ఉండాల్సిన పోలీసులే నేడు వైసిపి కార్యకర్తలా వ్యవహరించడం దారుణమని వాపోయారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కుప్పం ప్రజలు చంద్రబాబుకు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - రామసముద్రం

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్ఆర్ పెన్షన్ కానుకతో వృద్ధులకు ఎంతో భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి పాలనలో పెన్షన్లు రాక ఎంతోమంది వంచనకు గురయ్యే వారని అన్నారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతినెలా ఒకటో తేదీన ఉదయాన్నే లబ్ధిదారులకు వాలంటీర్ల ద్వారా పెన్షన్లు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కుసుమకుమారి,జడ్పిటిసి సిహెచ్ రామచంద్రా రెడ్డి, వైస్ ఎంపిపిలు రమణా రెడ్డి, గంగాధర్ నాయుడు, కన్వీనర్ భాస్కర్‌గౌడ్, సింగల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఎంపిడిఒ సురేష్ బాబు, ప్రజలు పాల్గొన్నారు. **నందలూరు :** మండల పరిధిలోని స్థానిక పాటూరు, నందలూరు సచివాలయాలలో నూతనంగా మంజూరైన వైఎస్ఆర్ పింఛన్ కార్యక్రమంలో ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పాల్గొని పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, పాటూరు సుధాకర్‌రెడ్డి, శ్రీను, సర్పంచ్ జంబుసూర్యనారాయణ, ఎంపిటిసి సుభాన్, వైసిపి నాయకులు నాగసుబ్బయ్య, నాని, కాకి చంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణ మన చేతుల్లోనే

ప్రజాశక్తి-కలికిరి

రక్తహీనత నివారణ మన చేతుల్లోనే ఉందని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శేషగిరిబాబు అన్నారు. కలికిరిపట్టణంలో నిర్వహిస్తున్న విఒ సమావేశానికి హాజరైన మహిళలకు, కిశోరబాలికలకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలలో రక్తహీనత నివారణకు గాను ప్రతీ గురువారం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో మధ్యాహ్నం భోజనం అనంతరం ఐరెన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు మింగించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలు, విద్యార్థులు అనిమియాకు గురికాకుండా ఆరోగ్యముగా వుండి వారిలో పెరుగుదల, అభివృద్ధి జరుగు తుందని, మెదడు చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. ఐరెన్ మాత్రలతో పాటుగా గర్భవతులు, బాలింతలు ఆకు కూరలు, పండ్లు, ఖర్జురా, బెల్లంతో చేసిన వంటలు వంటివి నిత్యం ఆహారంలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఎమ్ఎల్‌హెచ్‌పి పావని, ఎఎన్ఎమ్.మాధవి, అంగన్వాడీ కార్యకర్త ప్రసన్న, సంఘమిత్ర సుభాషిణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక కోసవారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలకు రక్తహీనత నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు 10 నుండి 19 సంవత్సరాల కిశోర బాలి కలకు రక్తహీనత నివారణకు సలహాలు,సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎన్ఎం కె.ప్రమీల, ఆశ కార్యకర్తలు అలీమా, తులసి, రామలక్ష్మి, అంగన్వాడీ కార్య కర్తలు పార్వతీ, శారదమ్మ, ఆయా పార్వతమ్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-గుర్రంకొండ



ప్రాధానోపాధ్యాయుడు శివయ్య(ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శివయ్య శుక్రవారం గుండెపోటుతో మరణించారు. శుక్రవారం ఉదయం తన స్వగృహంలో హఠాత్తుగా గుండె పోటు రావడంతో మదనపల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తుల సందర్శనార్థం ఉంచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర, మండల వైసిపి కన్వీనర్ ముక్తియార్ అలీఖాన్ ఆయన భౌతికయని సందర్శించి నివాళులర్పించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కలికిరి : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే అంటురోగాలు దూరమవుతాయని మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, కార్యదర్శి తిమ్మారెడ్డిలు గ్రామస్థు లకు సూచించారు. డిపిఒ ధనలక్ష్మి ఆదేశాల మేరకు పంచాయతీలలోని పలు గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం పంచాయితీలోని బోడిరెడ్డిగారిపల్లెలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వీధులను శుభ్రపరచి, పేడదిబ్బలు తొలగించి స్ప్రే చేయించారు. అంటు రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రమేష్ కుమార్ రెడ్డి

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడల్లో రాణించాలని ఆర్.రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు మండల కేంద్రంలోని అనంతపురం గ్రామం వడ్డేపల్లిలో ముఖ్యఅతిథిగా నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడలు పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనేం దుకు నైపుణ్యత పెంపొందించుకొని కృషి చేయాలని సూచించారు. తొలి మ్యాచ్‌ను కుర్నూతల అగ్రహారం, రాచపల్లి జట్ల మధ్య టాస్ వేసి టోర్న మెంటు ను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఉత్సాహాన్ని నింపారు. కార్య క్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ, వెంకటరామరాజు, జై భీమ్‌సేవ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు, రమణ, గంగా ధర్, వేమయ్య, వేణు, టిడిపి యూత్ అధ్యక్షులు ధర్మారెడ్డి, శివకుమార్, యాదవ్,రవి,హరి, శ్రీను పాల్గొన్నారు.

సిబిఎస్ఇ సిలబస్‌పై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన సిబిఎస్ఇ విద్యపై కోర్స్ డైరెక్టర్ డివైఇఒ కృష్ణప్ప ఆధ్వర్యంలో కలికిరి సైనిక్ స్కూల్లో ఉపాధ్యాయులకు రెండు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025 నాటికి దాదాపుగా జిల్లాలో వెయ్యి పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్ ఇంప్లిమెంట్ చేస్తారని తెలిపారు. కార్యక్రమం ఆర్‌పిలు వి.సుశీల, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎఆర్.మంజుల, సురేష్ రెండు రోజులపాటు కెజిబివి, రెసిడెన్షియల్ జడ్పి హైస్కూల్ నుండి 30 మంది హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్‌లు 31 మంది ఫస్ట్ అసిస్టెంట్‌లు, 61 మందికి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏ సమయంలోనైనా సిబిఎస్ఇపై ఎలాంటి సందేహా నివృత్తి కోసం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను సందర్శించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ రంగనాథ రెడ్డి, సిఆర్‌పిలు సురేష్, భాస్కర, రియాజ్‌లు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు : పీడీ

ప్రజాశక్తి-వీరబల్లి



సామాజిక బహిరంగ సభలో డ్వామా పీడీ మద్దిలేటి

ఉపాధిలో అవకతవకులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సామాజిక బహిరంగ సభకు శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీలకు పనులు కల్పించకుండా ఇష్టారాజ్యంగా పనిచేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాలుగు రోజులకు జరిగిన సామాజిక తనిఖీ బృందం పంపిన వారి విచారణలో అంశాలను సభలో వివరించారు. వాటికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. 12 గ్రామపంచాయతీలో చేసిన సామాజిక తనిఖీ బృందం వారి విచారించిన సమాచారాన్ని గ్రామసభలలో చర్చించారు. రూ.33426లు అవకతకులకు పాల్పడినట్లు సభలో నిర్ధారించారు. ఆ డబ్బులను వారి నుంచి రికవరీ చేసినట్లు పీడీ తెలిపారు. అనంతరం ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు ప్రజలకు అవసరమయ్యే పనులను మాత్రమే ఉపాధి సిబ్బంది గురించి చేపట్టాలన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పీడీకి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, ఎపిడి రెడ్డప్ప నాయుడు, డిఇఒ ప్రకాష్, ఎస్‌టిఎం గౌరీశంకర్, ఎస్ఆర్‌పి సూర్య చక్రం, ఎపిఒ నాగరాజ్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ మంచి అనుభూతిగా మిగిలిపోవాలి : డిఎస్‌పి



రోడ్డు ప్రమాదలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-కురబలకోట

డ్రైవింగ్ అనేది ఓ మంచి అనుభూతిగా మిగిలిపోవాలే కాని, జీవితాల్లో మాయని మచ్చగా, తీర్చలేనిలోటుగా మారకూడదని డిఎస్‌పి కె.కేశప్ప విద్యార్థుల కు పిలుపునిచ్చారు. శుక్రవారం అంగళ్ళు లోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల నందు ముడివేడు పోలీస్ విభాగము ఆధ్వర్యంలో రహదారుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. కార్యక్రమం లో డిఎస్‌పి కె.కేశప్ప మాట్లాడుతూ యువతకు రోడ్డు భద్రతపై అవగహన కల్పించారు. డ్రైవింగ్ విషయంలో చేసే చిన్నచిన్న పొరపాట్లు పెద్ద పెద్ద తప్పిదాలకు కారణం అవు తుంటాయని అన్నారు. వాహనం నడుపుతున్నప్పుడు మన తప్పిదం లేకపోయినప్పటికీ, అవతలి వారి తప్పిదాల కారణంగానైనా ప్రమాదం జరగవచ్చునని అన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రతి క్షణం అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను అల సటగా ఉన్నప్పుడు డ్రైవింగ్ చేయకూడాదని, మద్యం సేవించి వాహనం నడపటం ప్రమా దకరమే కాదు చట్టరీత్యా నేరమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, సిఐ శివా ంజనేయులు, ఎస్ఐ సుకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



మసీదులో ప్రార్ధనలు చేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా

జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్ఎ కరీముల్లా శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక మైనారిటీ నాయకులతో కలసి మండలంలోని మష్టూరు మసీదు, నిమ్మనపల్లిలోని సయ్యద్‌షావల్లి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 14 మసీదులతో పాటు సయ్యద్‌షావల్లి దర్గా ఉన్నాదని అన్నారు. మసీదుల్లోని సమస్యలను పరిష్కరించి వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో మౌలిక వసతులను కల్పించడానికి ప్రణాళికలను స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దర్గాలకు సంబంధించిన భూములను, వక్ఫ్ బోర్డ్ భూములను కాపాడటానికి కృషి చేస్తానన్నారు. మండలంలో 14 మసీదులు ఉండగా ప్రస్తుతం కేవలం 5 మసీదుల్లోని ఇమామ్ లకు, మోజాన్‌లకు మాత్రమే ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయం అందుతుందని అన్నారు. మిగిలిన మసీదుల్లోని వారికి కూడా ఆర్థికసాయం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఖాదర్ భాషా, రఫీ, అంజాద్, నూర్ మొహిద్దీన్ ఖాన్, ముకాసిద్ అలీ ఖాన్, మస్తాన్, ఖాదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం వాయిస్ ఆఫ్ బి.కొత్తకోట సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత తగ్గిపోతోందని అన్నారు. ఇందుకు కారణం ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోవడం, రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు లేకపోవడం వంటి కారణాలు ఉన్నాయని అన్నారు. దేశానికి వెన్నుముక అయిన రైతులను కాపాడుకోవాలన్నారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, సంస్థ ప్రతినిధులు బొరుగుల సలీం, పీరుల్లా, శీను నవతరం, పవన్, హరి, పవన్ సాయి, హేమంత్ భాను, ప్రకాశ్ రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి-గాలివీడు

జవహర్ నవోదయ విద్యాలయాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు 2023-24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల అయినట్లు బాలికల బాలుర ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యా యులు ఒ.నిర్మల, బిరెడ్డేన్న ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తు తం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తూ చేసుకోవడానికి అవ కాశం ఉంటుందని, చివరి తేదీ ఈ నెల 31న చివరి తేది, పరీక్ష ఏప్రిల్ 29న జరుగుతుందని చెప్పారు. 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యా ర్థులకు అందుబాటులో ఉంటాయని, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-వీరబల్లి

దోమల నివారణతో ప్రాణాంతకమైన వ్యాధులు దూరమైతాయని డింహెచ్ఒ కొండయ్య పేర్కొన్నారు. వీరబలి పిహెచ్‌సిని శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మండలంలో జరుగుతున్న డ్రైడే ఫ్రైడేని గురించి తెలుసుకున్నారు. అందరూ తప్పకుండా డ్రైడే ఫ్రైడే తప్పక పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మురికి గుంతలు నీటి నిల్వ తెలిస్తేలార్వ ఉత్పత్తి కాకుండా గంబుసియా చేపలు పంపి స్తామ న్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ లక్కిరెడ్డిపల్లి సబ్ యూనిట్‌అధికారి ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఒ ముసుధన్ రెడ్డి విష్ణు, సిహెచ్ఒ సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాల సేకరణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు అధిక లాభాలు కోసం ప్రముఖ పాల సేకరణ కంపెనీ అమూల్య సహకారంతో పాడి రైతులకు అధిక ధరలు కల్పించాలని ఉదేశ్యంతో ప్రభుత్వం తరపున పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధరావు పేర్కొన్నారు. శుక్రవారం వెలిగల్లు, సిద్దవరంగ్రామ సచివాలయంలో జగనన్న పాలసేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో పెద్దమండ్యం, కలిచెర్ల, వెలిగల్లు కేంద్రాలల్లో పాల చిల్లకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాలసేకరణ బాధ్యత మహిళా సంఘాలు చేపడతారని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఒ మురళి , సర్పంచులు సరస్వతి, విజయకుమారి, పంచాయతీ కార్యదర్శిలు శైలజ, సోమశేఖర్, హేమంత్ రెడ్డి, శేషాద్రి, సిసి ఆదిలక్ష్మి, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప రెడ్డి, వైసిపి నాయకులు చంద్రమోహన్ రెడ్డి ,రెడ్డెప్పరెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'జ్ఞానాంబిక'లో న్యాక్‌పీర్ కమిటీ పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కమిట పలు అంశాలపై పరిశీలన జరిపారు. గురు, శుక్రవారాల్లో న్యాక్ కమిటీ చైర్మన్, అన్నామలై యూనివర్శిటీ రిటైర్డ్ వైస్ చాన్సలర్ డాక్టర్ మణియన్ సెల్వముత్తు, మెంబర్ కో-ఆర్డినేటర్, హర్యానా రాష్ట్రం గురు జంభేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉషాఆరోరా, మెంబర్ శ్రీనగర్ రాష్ట్రం పుల్వామా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ముస్తాబ్ అలీ, మిర్ కూడిన త్రిసభ్య కమిటీ జ్ఞానాంబిక కళాశాలలో పలుఅంశాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం, ల్యాబ్‌సౌకర్యం, అధ్యాపకుల క్వాలిఫికేషన్, రికార్డులు, విద్యార్థులకు ప్లేస్మెంట్‌లు, క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలు, ఆవార్డుల అంశాలను న్యాక్ పీర్ కమిటీ పరిశీలించారు. కార్య క్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, ఐక్యూఇఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమ్య , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎస్ కన్వీనర్ సి.వి.రమణమూర్తి

సిపిఎస్ రద్దుకు 2కె వాక్ : యుటిఎఫ్

ప్రజాశక్తి-పుల్లంపేట

యుటిఎఫ్ రాజంపేట డివిజన్ లెవెల్‌లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 2కె వాక్ ఉంటుందని జిల్లా సిపిఎస్ కన్వీనర్ సి.వి. రమణమూర్తి తెలిపారు. జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జావబీర్ మాట్లాడుతూ అన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులందరూ తమ తమ మండలాల్లో ఉండేటువంటి సిపిఎస్, ఒపిఎస్ ఉపాధ్యాయులందరినీ 2కె వాక్ కు సిద్ధం చేయాలని చెప్పారు. సిపిఎస్ రద్దుపై జరిగేటువంటి 2కె వాక్ రాజంపేట ఎంఆర్‌సి నుండి ప్రారంభమవుతుందని అదేవిధంగా కొనసాగుతూ మార్కెట్, అమ్మవారి శాల, పాత బస్టాండ్ సర్కిల్, ఆర్ఎస్.రోడ్డు మీదుగా గవర్నమెంట్ హై స్కూల్ గ్రౌండ్ వరకు సాగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చినటువంటి హామీలను మరిచారని, ఈ పాదయాత్ర ద్వారా ఆయనకు నిరసన తెలియజేయడానికి ఈ 2కె వాక్ ను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఎన్ఎస్‌యుఐ నూతన కమిటీ ఎన్నిక

పీలేరు : నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయిసంపత్ కుమార్ తెలిపారు. శుక్రవారం పీలేరులో జరిగిన సభ్యుల సమావేశంలో అధ్యక్షులుగా హేమంత్ ఆచారి, ఉపాధ్య క్షులుగా మహేష్‌బాబు, ప్రధానకార్యదర్శిగా సాయిమౌళి, కార్య దర్శు లుగా నిత్యసాయి, అమర్నాథ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. సంపత్ మాట్లాడుతూ రాష్ట్రఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్‌యుఐ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.

మానవత్వం చాటుకున్న ఆర్ఐ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో కొంత కాలంగా పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్న సుబ్బమ్మ (70) శుక్రవారం దీన స్థితిలో మృతి చెందింది. 10 గంటలపాటు బంధుమిత్రులు ఎవరు ముందుకు రాకపోవడంతో మృతురాలి కుమార్తె మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జునను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ సిబ్బందితో వారి ఇంటికి చేరుకొని హిందూధర్మ సంప్రదాయం ప్రకారం సొంత ఖర్చులతో చివరి సంస్కారంపూర్తి చేశారు. అనంతరం మానవతా శాంతిరథంలో అంత్యక్రియలకు తరలించారు.

బస్టాండ్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

లక్కిరెడ్డిపల్లెలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్ ను పునరుద్దరించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నిలిపేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మూడు రోడ్ల కూడలి వద్ద ప్రయాణికులు రోడ్లపైనే నిల్చోని ఎదురు చూస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ దుమ్ము ధూళి కొట్టుకోవడం,ఎండ వేడికి, గాలికి బస్సులు వచ్చే వరకు నిల్చోనే దుర్భర పరిస్థితుల్లో ప్రయాణికులు రోడ్లపైనే ఉంటున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ చేయడానికి పోలీసులు ఆపసోపాలు పడుతున్నారని అన్నారు. ఇక్కడ తరచుగా ట్రాఫిక్ బంద్ జరగడంతో దూరప్రాంతాలకు వెళ్ళవలసిన ప్రయాణికులకు తమ ప్రయాణం ఆలస్యం అవుతుందని తెలిపారు. ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక చోరవతో బస్టాండ్‌ను పునరుద్ధరించాలని కోరారు. బస్టాండు లేక పోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్టాండును పునరుద్దరించాలని అన్నారు. బస్టాండు ఆవరణాన్ని శుభ్రం చేయించి, బస్టాండులో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.



మొక్కలను నాటుతున్న మిట్స్ విద్యార్థులు

గొల్లపల్లెలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని మిట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్యాంపు గొల్లపల్లి గ్రామములో వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆగ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తారని ఆయన అన్నారు. గ్రామంలో మొక్కలు నాటడం, పరిసరాలను శుభ్రం చేయడం, కరోనా నివారణకు శానిటైజేషన్, మాస్కులను పంపిణీచేయడం, స్కూల్ విద్యార్థులకు విద్యపై అవగాహన ఆటలపోటీలను నిర్వహిచడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ మాట్లాడుతూ విద్యను మధ్యలో ఆపకూడదని, ఎంతవరకు చదవగలమో అంతకంటే ఎక్కువ ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఆటల పోటీల ను నిర్వహించారు.



గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి

మౌలిక వసతులకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బి.కొత్తకోట

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలం లోని మడుమూరు సచివాలయ పరిధిలోని మడుమూరు, శ్రీనివాసరాయునిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని పేదలైన అర్హులందరికీ సకాలంలో అందాలని అధికా రులను ఆదేశించారు. ప్రజా సమస్యలను సులభంగా, వేగంగా పరిష్కరించడానికి గ్రామ సచివాలయాలు దోహదపడుతున్నాయని అన్నారు. మండలంలో దాదాపు సిసి రోడ్లు, తాగు నీటి ట్యాంకులు, మురుగనీటి కాలువల నిర్మాణాలు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి, మడుమూరు సర్పంచ్ నాగరత్న భాస్కర్ నాయుడు, ఎంపిపి మహమ్మద్, వైసిపి నియోజకవర్గ మహిళా కన్వీనర్ అనిత చక్రవర్తి, పులికల్లు సర్పంచు పూల గిరీష్, ఎంపిటిసి సయ్యద్, మల్లెల మాజీ సర్పంచ్ వెంకట్, సచివాలయం కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, కిట్టి, మార్కెట్ యార్డ్‌డైరెక్టర్ అయూబ్‌భాష, నక్కమహేష్ పాల్గొన్నారు.

ఎంజెఆర్‌లో వైభవంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి-పీలేరు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మొదటి సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వ హించామని కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్‌తో పాటు ప్రిన్సిపల్ ఎన్.సుధాకర్‌రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా ప్లేస్మెంట్లను అందించదమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు చక్కటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. వినిద బ్రాంచీల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ద్వారకానాథరెడ్డి, రెడ్డి ఖాసీం, నాగరాజు, నాగార్జున, నరేంద్ర, సుభాషిణి, భార్గవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యాపారిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



గాయపడిన టి.వారధి

పట్టణంలోని సిటిఎం రోడ్ ఎస్టేట్ కు చెందిన టి.వారది అనే వ్యక్తిపై భాను ప్రకాష్ అనే యువకుడు శుక్రవారం కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం వాల్మీకిపురం మండలం పల్లికి చెందిన టి. వారధి అనే వ్యక్తి 10 సంవత్సరాల క్రితం మదనపల్లె సిటిఎం రోడ్డులోని ఎస్టేట్ వద్ద కాపురం పెట్టారు. తన సొంతూ రులో రెడ్డిశేఖర్ అనే వ్యక్తి మరదలుకి 60 వేల రూపాయలను వడ్డీకి ఇచ్చారు. అయితే నెలల వడ్డీలు చెల్లించకపోవడంతో గురువారం అక్కడికి వెళ్లి డబ్బులు చెల్లించాలని అడిగినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం రెడ్డిశేఖర్ మరదలు కుమారుడు భాను ప్రకాష్ కత్తితో పొడిచి దాడి చేసినట్లు తెలిపారు. గాయపడిన వారాధి స్థానిక మదనపల్లి ప్రభుత్వ జిల్లా వైద్యశాల నందు చికిత్సలు పొందు తున్నాడు. కత్తితో పొడిచిన భానుప్రకాష్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-పీలేరు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును సీజ్ చేసి, డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. శుక్రవారం కె.విపల్లి మండలం, జిల్లేళ్ళమంద సమీపంలోని పింఛానది నుంచి యర్రావారిపాలెం మండలానికి చెందిన మద్దెల ప్రణీత్ ఇసుక తరలిస్తున్నాడన్న సమాచారం అందుకుని తాను తన సిబ్బందితో సహా అక్కడికి చేరుకున్నామని అన్నారు. ఇసుక తరలిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకుని, ట్రాక్టర్ సీజ్ చేసి, కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కేబుల్ వైరు చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

లక్కిరెడ్డిపల్లె : సెల్ టవర్ బ్యాటరీ కేబుల్ వైరు చోరీ కేసులో దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. నిందితుడు జియో సెల్ టవర్ కంపెనీలో పని చేస్తూ కేబుల్ వైరును రాజంపేట, కడప లక్కిరెడ్డిపల్లి ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న బ్యాటరీ టవర్‌వైర్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్స్ రాంప్రసాద్, గోపీనాయక్, బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.